# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

బొడ్రాయిబజార్, డిసెంబర్ 9 : కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని అందుకు జరిగే పోరాటాల్లో తాము ముందుంటామన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వైపు నుంచి లోపాలను సమీక్షించుకుని జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని తెలిపారు. శనివారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీగా ఓటర్లు చూశారే తప్ప మూడో పార్టీకి అవకాశం ఇవ్వలేదన్నారు. సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల నుంచి రావాల్సిన ఓట్లను మలుచుకోలేకపోయామని ఇది బలహీనతగా గుర్తించాల్సిన అవసరం ఉన్నట్లు తెలిపారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని అభినందిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, పారెపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

# ముగిసిన అర్వపల్లి ఉర్సు

అర్వపల్లి, డిసెంబర్ 9 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అర్వపల్లి హజ్రత్ సయ్యద్ ఖాజా నసిరుద్దీన్‌బాబా ఉర్సు ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం మధ్యాహ్నం దర్గా ఆవరణలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం దీపారాధన(చిరాగ్) చేశారు. కార్యక్రమంలో ముజవరి సయ్యద్ అలీ, మహ్మద్ అబ్దుల్ హుస్సేన్, సయ్యద్ హబీబ్, మహ్మద్, ఎస్‌కే నజీర్, సోఫి, ముస్లింలు పాల్గొన్నారు.


దర్గాలో దీపారాధన చేస్తున్న ముస్లింలు

# లంబాడీలకు మంత్రి పదవిని కేటాయించాలి

- **గిరిజన విద్యార్థి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చందూనాయక్**

మర్రిగూడ, డిసెంబర్ 9: రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు చోటు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం అమునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు మెగావత్ చందూనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లంబాడీ బిడ్డలైన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారని, వారికి మంత్రి పదవులివ్వకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తుందని ఆరోపించారు. మళ్లీ రెడ్డి రాజకీయం మొదలైందని విమర్శించారు. లంబాడీల మంత్రి పదవిని కేటాయించాలన్నారు.

# ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తులు

కట్టంగూర్, డిసెంబర్ 9: చదువుకు దూరమై 14 ఏండ్లు నిండిన వారు ఓపెన్ టెన్త్, పదోతరగతి పూర్తయిన వారు ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ స్కూల్ సొసైటీ కోఆర్డినేటర్ అంబటి అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న చివరి తేదీ అని చెప్పారు. పదో తరగతి లో ప్రవేశం కోసం రికార్డు షీట్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఫొటోతో దరఖాస్తు చేయాలని తెలిపారు. అలాగే ఇంటర్‌లో చేరేందుకు కోసం పదో తరగతి టీసీ, మెమో, కుల ధృవీకరణ పత్రం ఆధార్ కార్డు, ఫొటోను అప్లికేషన్ ఫారంనకు జత చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9553935097, 9666964463 కు సంప్రదించాలని ఆయన సూచించారు.

# ఘనంగా శివ మాలధారుల మహా పడిపూజ

నార్కట్‌పల్లి, డిసెంబర్ 9: పట్టణ కేంద్రలోని మంచినీళ్ల బావి శివాలయం వద్ద శనివారం శివ మాలధారులు మహా పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మురళి తీర్థప్రసాదాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని అన్నారు. ఈ పూజల్లో సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి, మాజీ జడ్పీటీసీ సత్తయ్య యాదవ్, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లెంల అచ్చాలు గౌడ్, సట్టు సత్తయ్య, వేముల నర్సింహ, రాదారపు విజయలక్ష్మి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 9 : ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మహిళలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ పథకంతో మహిళలు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయొచ్చని తెలిపారు. డిపో పరిధిలో 45 ఎక్స్‌ప్రెస్‌లు, 62 పల్లె వెలుగు, కోదాడలో 18 ఎక్స్‌ప్రెస్‌లు, 40 పల్లె వెలుగు బస్సులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అనంతరం ఉచిత ప్రయాణానికి సంబంధించిన బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీవీఎం శివశంకర్, డీఎం సురేందర్, ఏఎంటీ నాగశ్రీ, ఆర్టీసీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.


మహిళలతో కలిసి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

## పకడ్బందీగా రాజీవ్ ఆరోగ్యశ్రీ

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. పేదలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల వైద్య సహాయం అందనున్నట్లు చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు హుజూర్‌నగర్, కోదాడ ఏరియా ఆస్పత్రుల్లో ఈ పథకం ద్వారా మెరుగైన సేవలందుతాయని వెల్లడించారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రెడ్డి, డీఐఓ డాక్టర్ వెంకటరమణ, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

కోదాడటౌన్ : మహిళలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మహలక్ష్మి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీహర్ష, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్లు సామినేని ప్రమీల, షాబుద్దీన్ పాల్గొన్నారు.


ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

# ఉపాధి హామీ పని దినాలు పెంచాలి

- సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, డిసెంబర్ 9 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎంఎంఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా కూలీలు ఉపాధి హామీ పనులు చేస్తున్నట్లు తెలిపారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని, రెండుసార్లు ఫొటోలు అప్‌లోడ్ చేసే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ రద్దు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వీరమల్లు, రమణయ్య, సుధాకర్, నర్సింహులు, అవిలయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

# కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు

చౌటుప్పల్, డిసెంబర్ 9: తెలంగాణ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పీపల్‌పహాడ్‌లోని రంగనాథ స్వామి ఆలయంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కొండ యాదగిరి, మండల ఉపాధ్యక్షుడు మెట్టు మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి యర్ర అంజయ్య, దేవాలయ చైర్మన్ వినుకొండ సత్యనారాయణ, వార్డు సభ్యులు యర్రగోపాల్, వలిగొండ కళ్యాణీరవి, మాధవి, మల్లేశ్‌గౌడ్, యర్రయాదగిరి, సింగపంగ రంగయ్య, గట్టు మల్లేశ్, బత్తుల మల్లేశ్ పాల్గొన్నారు.

# గృహ కార్మికులకు ప్రభుత్వ పథకాల్లో అవకాశం కల్పించాలి

- గృహ కార్మికుల యూనియన్ జిల్లా కో ఆర్డినేటర్ అనసూర్య

బొడ్రాయిబజార్, డిసెంబర్ 9 : నివాస గృహాల్లో పనిచేసే గృహ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గృహ కార్మికుల యూనియన్ జిల్లా కో ఆర్డినేటర్ కాసా అనసూర్య అన్నారు. మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక నంబర్ 2 పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యూనియన్‌లో ఇప్పటి వరకు 800 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. అయితే వారికి ప్రభుత్వ పథకాల్లో ఎలాంటి అవకాశం లభించడం లేదన్నారు. గృహ కార్మికులకు డబుల్ బెడ్రూం ఇండ్లు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్‌తో పాటు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరారు. 8 గంటల పనికి రూ.12 వేలు వేతనం ఇవ్వాలని, వారంలో ఒక రోజు సెలవు కేటాయించాలని ఈ సందర్భంగా ఆమె యజమానులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గృహ కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు పాల్వాయి సుహాసిని, పద్మ, రేణుక, శారద, నాగమ్మ, వరలక్ష్మి, నిర్మల, గృహ కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గృహ కార్మికుల యూనియన్ జిల్లా కో ఆర్డినేటర్ అనసూర్య

# విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందించాలి

- పీడీఎస్‌యూ

సూర్యాపేట అర్బన్, డిసెంబర్ 9 : వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా బస్‌పాస్‌లను అందించాలని పీడీఎస్‌యూ నాయకులు శనివారం డిపో మేనేజర్ సురేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పుల్లూరి సింహాద్రి, భరత్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచితంగా బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లుగానే విద్యార్థులకు లింగ భేదం లేకుండా ఉచితంగా బస్‌పాస్‌లను అందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రహీం, మహేశ్, నవీన్, గోపి, వినయ్ పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు